


## కుప్పం ప్రజల రుణం ఎన్నటికీ తీర్చుకోలేం



5లో

17
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
గురువారం | 25 జులై 2024 | పేజీలు 8

# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

**పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు**

**ఎస్‌హెచ్‌ఓలు తరచుగా గ్రామ స్థాయిలో గ్రామ సభలు ఏర్పాటు చేసి గ్రూపు తగాదాలు లేకుండా అరికట్టాలి**

**మహిళలు, వృద్ధుల ఫిర్యాదు దారులకు పోలీస్ స్టేషన్ అండగా నిలవాలి**

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ కార్యాలయం సంబంధించి వడమాలపేట, పుత్తూరు అర్బన్, నారాయణవనం, వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్‌లు, పుత్తూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలను తనిఖీ చేసి ఎస్‌హెచ్‌ఓ, పోలీస్ స్టేషన్ల సిబ్బంది యొక్క పనితీరును సమీక్షించి జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి పలు రికార్డులను తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు తనిఖీ చేసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల నందు దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న కేసులను సకాలంలో దర్యాప్తు పూర్తి చేయుటకు అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి త్వరిత గతిన పూర్తి చేయాలనీ, మహిళా సంభందిత నేరాల పట్ల వెంటనే స్పందించి బాధితులకి సరైన న్యాయం చేయాలన్నారు. పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం, నారాయణవనం కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం, నాగలాపురం వేదనారాయణస్వామి దేవాలయం, సురుటుపల్లి కొండేశ్వర స్వామి దేవాలయం, సదాశివ కోన దేవాలయం, అమ్మ భగవాన్ ఆధ్యాత్మిక కేంద్రం వంటి ప్రముఖ



మిగతా 2లో

# వెలుగు రెగ్యులర్ ఏపీఎంను నియమించరా..?

**ఇన్‌చార్జ్ వేధింపులు**
**పొదుపు సభ్యులు ఆవేదన**

**గూడూరు, మేజర్‌న్యూస్:**

ప్రభుత్వం మహిళల్లో ఆర్థిస్వావలంభన తీసుకు వచ్చి లక్షాదికారుల చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న వెలుగు పథకం కొందరికే వెలుగులు నింపేది మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాకాడు మండలం వెలుగు పథకం సంబందించి పొదుపు సంఘాల గ్రూపుల సభ్యులు ఇన్చార్జి ఏపీఎం మాధవి మీద వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పొదుపు కార్యాలయంలో దాదాపు ఒక సంవత్సరం నుంచి రెగ్యులర్ ఏపీఎంను నియమించలేదు. దీంతో వాకాడు క్లస్టర్ సీసీఇన్చార్జి ఏపీఎంగా కొనసాగుతున్నారు. ఇన్‌చార్జ్ ఏపీఎం ఆగడాలు భరించలేక పొదుపు సంఘాల సభ్యులు ఆవేదనకు గురవుతున్నారు. రుణాలు తీసుకుంటే, కమీషన్లు ఇవ్వాలని వేధిస్తున్నారని పొదుపు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌చార్జ్ ఏపీఎం పర్యవేక్షణలో వెలుగు పథకంలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని పొదుపు సభ్యులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఆసరా పథకం లావాదేవీల్లో ఏపీఎం చెప్పిందే వేదంగా జరగాలని సలహాలు సూచనలు ఇస్తుందన్నారు. మండలంలోని కొన్ని సాంకేతిక కారణాలతో ఆసరాపథకంలో పొదుపు సభ్యులు తీవ్రంగా నష్టపోతున్నప్పటికీ ఏపీఎం ఆ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం పైసలిస్తే చేస్తానని చెప్తుందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలుగు కార్యాలయంకు సిబ్బంది సక్రమంగా రారని తాము ఫీల్డ్‌లో ఉన్నామంటూ ఓదో ఒక సాకు చెపుతూ వెలుగు



మిగతా 2లో

# స్మగ్లర్ల ఆటకట్టించేందుకు జాగిలాల సేవలు

**టాస్క్ ఫోర్స్ హంటర్, గంగ జాగిలాల పనితీరును పరిశీలించిన ఎస్పీ**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

శేషాచల అడవులలో ఎర్రచందనం స్మగ్లర్ల ఆటకట్టించేందుకు జాగిలాల సేవలను కూడా వినియోగిస్తామని టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం తిరుపతిలోని ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక కార్యాలయం ప్రాంగణంలో హంటర్, గంగ జాగిలాల తమ పనితీరును ప్రదర్శించాయి. ఈ సందర్భంగా జాగిలాల పనితీరును టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్ల ఆటకట్టించేందుకు టాస్క్ ఫోర్స్ జాగిలాల సేవలను కూడా అదనంగా వినియోగిస్తామని ఎస్పీ తెలిపారు. టాస్క్ ఫోర్సుకు ఐదు జాగిలాలు ఉన్నాయని, రెండు తిరుపతిలో ఉన్నాయని, మిగిలిన మూడు కడప, రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ లలో ఉపయోగిస్తున్నమన్నారు. అనుమానిత చెక్ పోస్టులతో పాటు, అటవీ ప్రాంతాల వైపు ప్రయాణించే వాహనాలను జాగిలాల ద్వారా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో డంప్‌లను ఏర్పాటు చేసి ఉంటారని, వీటిని జాగిలాలు వెంటనే కనుగొనే పరిస్థితి ఉంటుందన్నారు. గతంలో కూడా జాగిలాల సేవలను వినియోగించుకున్న విషయం తెలిసిందేనని, అదే తీరులో మళ్లీ తాజాగా జాగిలాలను ఉపయోగించుకోనున్నట్లు చెప్పారు. ప్రయోగాత్మకంగా టాస్క్ ఫోర్స్ కార్యాలయం ప్రాంగణంలో జాగిలాల పనితీరును పరిశీలించగా, అవి విజయవంతంగా పని చేశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డి, జాగిలాల ట్రైనర్లు పాల్గొన్నారు.





## శివలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయం పరిశోధన విద్యార్థిని ఉప్పాల శివలక్ష్మికి డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసినట్లు పరీక్షల నియంత్రణ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని విద్యా విభాగానికి చెందిన ఆచార్యులు పి.రేణుక మార్గదర్శకత్వంలో "స్టడీ హ్యాబిట్స్, ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ ఇంట్రెస్ట్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీ సమర్పించినట్లు ఎగ్జామినేషన్ ఆచార్య జీవనజ్యోతి వెల్లడించారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. శివలక్ష్మికి డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## డీసీఓ బీఆర్‌అంబేద్కర్ గురుకుల పాఠశాల తనిఖీకి

### ముద్ద కట్టిన అన్నం, నీళ్ల సాంబార్ , నాసిరకం క్యారెట్, పరిమాణం తక్కువగా ఉన్న కోడిగుడ్లు గుర్తింపు

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** శాంతిపురం మండలం కడపల్లి వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను చిత్తూరు జిల్లా డీసీఓ టి.పద్మజ అకస్మాత్తుగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చించి సమస్యలను ఓపిగ్గా విని సాధ్యమైనంత తొందరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తానని మొత్తం పాఠశాల ప్రాంగణాన్ని గదులను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న బోర్డులు, మరుగుదొడ్లు, పాముల బెడద వుందని పిల్లలు ఆమెకు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. అలాగే పిల్లలకు ఇంగ్లీష్‌బోధించి ఉపాధ్యాయుడు లేదని చెప్పడంతో తాను కూడా ఇంగ్లీష్‌టీచర్ అని మీకోసం ప్రతిరోజు జూమ్ సమావేశంలో ఇంగ్లీష్ పాఠాలు చెబుతానని పిల్లల కష్టనష్టాలు తనకు తెలుసు అని చెప్పడంలో పిల్లలు చప్పట్లతో డిసిఓకు వారి కృతజ్ఞతను తెలిపారు.అనంతరం భోజనశాలను పరీక్షించి ముద్ద కట్టిన అన్నం, నీళ్ల సాంబారు, నాణ్యతలేని క్యారెట్లు, పరిమితి తక్కువగా ఉన్న కోడిగుడ్లు గుర్తించి సంబంధిత వారిని హెచ్చరించింది. అలాగే ఆడిటోరియంలో రోడ్లను లైట్లు మరి ముఖ్యంగా మరుగుదొడ్లను పరిశీలించి అన్ని సమస్యలకు జిల్లా కలెక్టర్ తో మాట్లాడి పరిష్కార మార్గం చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ కార్యాలయ సిబ్బంది, రామకుప్పం ఇంచార్జ్ ప్రిన్సిపల్, పాఠశాల కమిటీ చైర్మన్ ఎమ్మార్పీఎస్ నాయకులు దేవరాజు మాదిగ పాల్గొన్నారు.



## కృత్రిమ కాలు ఏర్పాటుకు 27న ప్రత్యేక క్యాంప్

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు వృద్ధులు సంక్షేమ శాఖ ఆదేశాలతో కృత్రిమ కాలు అమర్చుకోవడానికి తిరుపతి రాస్ భవనంలో ఈనెల 27వ తేదీ చెన్నై ఫ్రీడం ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆర్టిఫిషియల్ క్యాంపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె ఎల్ ఎన్ ఎం రెడ్డి తెలిపారు. ఈ క్యాంపులో పాల్గొని కృత్రిమ కాలు కోసం కొలతలు ఇచ్చిన వారికి సుమారు 51 వేల రూపాయల విలువగల వెయిట్ లెస్ కృత్రిమ కాలును ఉచితంగా అమరస్తారని తెలిపారు. అందువల్ల పుత్తూరు పట్టణంలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు హిజ్రాలు తిరుపతిలో రాస్ భవన్ లో ఈ నెల 27 వ తేదీ జరగనున్న ప్రత్యేక క్యాంపుకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ క్యాంపుకు హాజరు కావాలనుకునే వారు, వారి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం మెడికల్ సర్టిఫికేట్, వికలత్వం కనిపించే విధంగా రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు ఫోన్ నెంబర్ తో హాజరుకావాలని తెలిపారు.

## ట్రిబుల్ ఐటీకి ఎస్‌కే సిరీన్ ఎంపిక



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** స్థానిక ఆటో నగర్ ఆర్.జీ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇటీవల వెలువడిన ట్రిబుల్ ఐటీ ఫలితాలలో చెందిన విద్యార్థిని ఎస్ కే సిరీన్ నూజివీడు ట్రిబుల్‌ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి విద్యార్థిని సెలెక్ట్ అవ్వడం పట్ల సంతోషంగా ఉందని, తరగతి ఉపాధ్యాయులు పివిఎల్ రమాదేవి, జయ చంద్రారెడ్డి, ఉపాధ్యాయసిబ్బంది, తల్లిదండ్రులు షబానా, షేక్ షఫీ హర్షం వ్యక్తం చేశారు.

## ఎస్ఎస్‌డీ టోకెన్ల కౌంటర్లను తనిఖీ చేసిన జేఈఓ గౌతమి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవారి భక్తుల కోసం టీటీడీ కేటాయిస్తున్న టైం స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్ డి) టోకెన్ల కౌంటర్లను జేఈఓ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేఈఓ శ్రీనివాసంలోని ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ కౌంటర్లు, క్యూ లైన్ లను పరిశీలించారు. అనంతరం విష్ణు నివాసంలోని గదుల కేటాయింపు, ఎస్ఎస్ డి టోకెన్ల కౌంటర్లను, క్యూ లైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. జేఈఓ వెంట టీటీడీ సిఈ నాగేశ్వరరావు, రవాణా విభాగం జిఎం శేషారెడ్డి, విజిఓ బాలిరెడ్డి, ఈఈ కృష్ణారెడ్డి, డిప్యూటీ ఈవోలు పార్వతి, భారతి ఉన్నారు.

# వెలుగు రెగ్యులర్ ఏపీఎంను నియమించరా?

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బంది ఎవరు అందుబాటులో ఉందరని పేర్కొంటున్నారు. అది ఏమని అడిగితే మా ఇష్టం మా ఆఫీసుల్లో మమ్మల్ని ఎవరూ అడగరు సభ్యులు ఎవరైన అడిగితే లోన్లు ఇవ్వము మీకు దిక్కున చోట చెప్పుకోండి అని బెదిరిస్తుందని సభ్యులు ఆరోపిస్తున్నారు. రుణాలు వసూళ్ల విషయంలోనూ అక్రమార్కులకు వంత పాడుతూ ప్రభుత్వ లక్ష్యం నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. మండలంలోని శ్రీనిధి పిఓపి తీసుకున్న సభ్యులు వద్ద నీకెంత, నాకింత వాటాలు ఏపీఎం అడుగుతుందని పలువురు గ్రూప్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌చార్జ్ వేధింపులు ఆళ లేక వెలుగు కార్యాలయానికి కొత్త ఏపీఎం ఎప్పుడు నియమిస్తారా అని సభ్యులు ఎదురు చూస్తున్నారు. సమావేశాలు పెట్టిన సమయంలోనూ సభ్యుల మీద దురుసుగా ప్రవర్తిస్తుందని సభ్యులు ఆరోపిస్తున్నారు, ఇన్‌చార్జ్ కొందరి మద్దతుతో విధులు సక్రమంగా చేయకుండా ఇళ్లలోనే ఉండి ఫీల్డ్‌లో ఉన్నామంటారని పేర్కొంటున్నారు, సుదూర ప్రాంతాల నుంచి వెలుగు కార్యాలయానికి రావాలంటే ఎవరు ఉంటారో ఎవరు ఉండరో తెలియక పొదుపు సభ్యులు రావడం లేదు. ఇకనైనా జిల్లా కలెక్టర్, వెలుగు పిడి స్పందించి ఇన్చార్జి అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మండల పొదుపు గ్రూపు సభ్యులు కోరుతున్నారు.




## కలెక్టర్, మేయర్‌ను కలసిన కమిషనర్

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** నగర పాలకసంస్థగా బాధ్యతలు చేపట్టిన నారపురెడ్డి మౌర్య జిల్లా కలెక్టర్ ను, నగరపాలక సంస్థ మేయర్ కలిశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీషను వేరువేరుగా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.





# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు వెలసి ఉన్నాయి. నిరంతరం పుణ్యక్షేత్రాల సందర్శనార్థం యాత్రికులు వస్తుంటారు. కావున హైవే రహదారుల యందు రోడ్డు ప్రమాదాలు నివారణకు స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పరిధిలోని ఎస్.హెచ్.ఓ లకు దిశా నిర్దేశం చేశారు. అంతేకాకుండా సదాశివ కోన, కైలాసకోన, సద్దికూడి మడుగు వంటి జలపాతాల సందర్శనార్థం పర్యాటకులు విరివిగా వస్తుంటారు. ఈ పర్యాటక ప్రదేశాల యందు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా విజిబుల్ పోలింగ్ ద్వారా ఎన్ఫోర్స్మెంట్ విధులను పెంచి పర్యాటకులకు రక్షణ కల్పిస్తూ, శాంతిభద్రతలను కాపాడవలసిన బాధ్యత మనదేనని సూచించారు. ఎస్.హెచ్.ఓలు, సిఐలు తరచుగా గ్రామ స్థాయిలో పర్యటించి గ్రామసభలు ఏర్పాటు చేసి, సదరు గ్రామాల యందు ఎలాంటి గ్రూపు తగాదాలు లేకుండా అరికట్టాలన్నారు. పటిష్టమైన వేగు వ్యవస్థను ఏర్పాటు చేసుకుని, సమాచారాన్ని క్రోడీకరించుకుని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పుత్తూరు పోలీసు సబ్ డివిజన్ పరిధి గుండా వెళ్లే హైవే రహదారుల యందు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రత్యేక కార్యచరణ చేపట్టి, ప్రమాదకరమైన మలుపులు, రోడ్ క్రాసింగ్ లను గుర్తించి అక్కడ సూచిక బోర్డులను, బారికేడ్లు ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగకుండా అరికట్టి, వాహనాల తనిఖీలను నిర్వహించి, ఎర్ర చందనం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాన్ని అరికడుతూ, నేరాలు జరగకుండా నివారించాలన్నారు. పుత్తూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో గల కేడీలు, బీసీలు, డిసీలు, పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై ప్రత్యేకమైన నిఘా ఉంచుతూ, పోలీస్ స్టేషన్ల పరిధిలో నేర నివారణ చేయుటకు ఈ-బీట్ సిస్టంను బలోపేతం చేసి పనితీరును మరింత మెరుగుపరచాలన్నారు. బహిరంగ ప్రదేశాల యందు మద్యపానం సేవించకుండా అరికట్టడానికి హైవే రహదారుల వరకు నిరంతరం గస్తీ కాచుటకు బ్లూ కోల్ట్స్, బీట్ సిస్టంను బలోపేతం చేసి, మరింత సమర్థవంతంగా పనిచేసి నేరనివారణ చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల యొక్క ఫిర్యాదులను స్వీకరించి చిన్న సమస్యగా ఉన్నప్పుడే ఇరుపక్షాలను పిలిపించి, వారితో మాట్లాడి, వారిని రాజీ చేయించి, ఎటువంటి నేరం జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. వడమాలపేట, పుత్తూరు అర్బన్, నారాయణవనం, వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్ల సిబ్బందితో సమావేశమై వారి సాధకబాధలను అడిగి తెలుసుకున్న అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ క్రమశిక్షణతో అలసత్వం ప్రదర్శించకుండా, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా విధులలో మానవతా దృక్పథంతో నిక్కచ్చిగా ఉండి, స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి మేమున్నామనే ధైర్యాన్ని ఇచ్చి ఫిర్యాదిదారులకు భరోసా ను కల్పించాలన్నారు. పుత్తూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసు మహిళా సిబ్బంది నేటి సమాజంలో గృహ నిర్బంధ మహిళ సంబంధిత విషయాలను, బాలికలు ఎదుర్కొంటున్న ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టం వంటి విషయాల గురించి సంబంధిత విద్యా సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాల యందు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్యవంతులను చేసి, కళాశాల, పాఠశాలల్లో బాలికల పట్ల ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన గురించి విద్యార్థులతో మాట్లాడి ఏదేని సంఘటనలపై ఆరాతియాలన్నారు. అలా జరిగి ఉంటే అధికారులు తెలుసుకుని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపిఎస్., సూచించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డిఎస్పి శ్రీనివాసరావు, సీఐలు ఓబులేసు పుత్తూరు అర్బన్, భాస్కర్ నాయక్ పుత్తూరు రూరల్, ఎస్ఐలు, వడమాల పేట, పుత్తూరు అర్బన్, నారాయణవనం, వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన మాజీ జడ్పీటీసీ దంపతులు





**చిట్టమూరు, మేజర్‌న్యూస్‌:** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్,పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ, గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ లను చిట్టమూరు మాజీజెడ్పిటిసి సభ్యురాలు దువ్వూరు భారతి రెడ్డి,చిట్టిరెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బుధవారం విజయవాడలో పొంగూరు నారాయణ,పాశిం సునీల్ కుమార్‌లతో పాటు సోమిరెడ్డి, పలువురు ఎమ్మెల్యే, మంత్రులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నట్లు మేజర్‌న్యూస్‌కు తెలిపారు.



## తెలుగు సభాపతికి ధన్యవాదములు

**పలమనేరు, మేజర్‌న్యూస్‌:** ఏపీశాసనసభలో కార్యకలాపాలు తెలుగు లో నిర్వహించాలని సభాపతి అయ్యన్న పాత్రుడు నిర్ణయించడం పట్ల తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసి నాదం నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదములు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో గ్రామ సచివాలయం నుండి రాష్ట్ర సచివాలయం వరకు కార్యకలాపాలన్నీ తెలుగులో నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

## ఘనంగా స్పోర్ట్స్ డే

**పలమనేరు, మేజర్‌న్యూస్‌:** ప్రభుత్వం ఆదేశాల మేరకు శిక్ష సప్తాహ్ పేరుతో పాఠశాలల్లో రోజుకు ఒక కార్యక్రమం ఈనెల 22 నుంచి 29 వరకు వారం రోజులు పాటు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖ అధికారులు పి.లీలా రాణి, సి.బాలసుందరం వారి ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ దొడ్డిపల్లి ఉన్నత పాఠశాల లో ఈ శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని చాలా చక్కగా నిర్వహించారు. అనంతరం స్పోర్ట్స్ డే సందర్భంగా అన్ని తరగతుల వారికి అన్ని రకాల ఆటలు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు చాలా చక్కగా ఆనందంతో, ఉత్సాహంతో పాల్గొనడం జరిగిందన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమానికి రోజువారీగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఖచ్చితంగా నిర్వహించాలని తెలియజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మండలం విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుందరం, జడ్పీహెచ్ఎస్ దొడ్డిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నేతాజీ, సిఆర్‌పిలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడుగా ఉమాపతి నాయుడు

**పలమనేరు, మేజర్‌న్యూస్‌:** ఇటీవల బంగారుపాళ్యం మండలంలో జరిగిన మామిడికాయల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య సమక్షంలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులుగా ఉమాపతి నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగాబుధవారం సాయంకాలం స్థానిక గ్రంథాలయం వద్ద అతని మిత్రబృందం పూల హారం వేసి శాలవాకప్పి ఉమాపతి నాయుడుకు ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఉమాపతి నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల రైతులకు సమస్యలు ఉంటే తన దృష్టికి తెలిపినచో తాను అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికికృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలోమిత్ర బృందం సభ్యులైన గోవర్ధన్, గణేష్, శ్యామ్, ధనశేఖర్, గోవిందు, చిట్టి, సుదర్శన్ బాలాజీ, గ్రంథాలయ అధికారి హేమంత్ కుమార్,సిద్దారెడ్డి, ఖాదర్ వల్లి, అనిల్, మా భాష, చంద్రబాబు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## నాలుగు మోటార్ సైకిళ్ల వేలం

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్‌:** పెద్దపంజాణి పోలీసు స్టేషన్‌లో మద్యం కేసులలో పట్టుబడిన నాలుగు మోటార్ సైకిళ్లను శుక్రవారం వేలం వేయనున్నట్లు పెద్దపంజాణి ఎస్సై సహదేవి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ మద్యం కేసులలో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈనెల 26వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు చిత్తూరు ఏఈఎస్ వారి ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గల వారు రెండు వేలు రూపాయలు డిపాజిట్ కట్టి వేలంలో పాల్గొనవచ్చని పంజాణి ఎస్సై తెలిపారు.



# కళా వైభవాన్ని ఆవిష్కరించిన అభినయ నాటక ప్రదర్శనలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్‌:** అభినయ ఆర్ట్స్ జాతీయ స్థాయి నృత్య, నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, పౌరాణిక, సాంఘిక నాటక ప్రదర్శనలు భారతీయ సంస్కృతి సాంప్రదాయ కళావైభవాన్ని ఆవిష్కరించి ప్రేక్షకులను అలరింపజేశాయి. ఇందులో భాగంగా ఉదయం 8. నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాగిన నృత్యపోటీలకు 180 మంది కళాకారులు హాజరై అద్భుత రీతిలో నృత్యాభినయ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం మధ్యాహ్నం విజయనగరం జిల్లా చెందిన కళాసాగర్ నాటక సంక్షేమ సేవా సంఘం వారు ప్రదర్శించిన శ్రీకాళహస్తీశ్వర మహత్యం పొరాగున్న నాటకం ఆద్యాంత భక్తిపారవశ్యాన్ని రేకెత్తించి ప్రేక్షకులను అలరింపజేసింది. తర్వాత గుడివాడకు చెందిన శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన మళ్లీకలసి జీవిద్దాం సాంఘిక నాటిక ప్రేక్షకుల్లో ఆలోచనలు రేకెత్తించింది. నేటి ఆధునిక సమాజంలో మనుషుల మధ్య, కుటుంబ వ్యవస్థల మధ్య దూరాన్ని "పెంచే స్థితిగతులను ఆవిష్కరిస్తూ మానవసంబంధం మరువని అనుబంధం అంటూ కలసి జీవిస్తే సుఖమయం అనే సందేశాన్ని అందించి ప్రేక్షకులను మేల్కొలుపు కలిగించింది. అనంతరం విశాఖపట్నంకు చెందిన తెలుగు కళా సమితి వారు ప్రదర్శించిన నిశ్శబ్దమా నీ ఖరీదెంత? సాంఘిక నాటిక ఆద్యాంతం ఆసక్తికరంగా సాగుతూ సభికులను ఆకట్టుకుంది. అనంతరం నాటక, నృత్య ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎన్.రెడ్డి, సంస్థ ప్రతినిధులు శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా" సత్కరించి అభినందించారు.





## పన్ను చెల్లింపులలో స్లాబులపై అవగాహన అవసరం

**ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేశ్ సామ్రాట్**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్‌:** పన్ను చెల్లింపుదారులకు పన్ను స్లాబులపై పూర్తిస్థాయిలో అవగాహన అవసరమని ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేశ్ సామ్రాట్ తెలిపారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాస ఆడిటోరియంలో "ఇన్కమ్ టాక్స్ ఔట్రీచ్ ప్రోగ్రాం" కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ సామ్రాట్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంతోమంది చార్టెడ్ అకౌంట్ విద్యార్థులు పూర్తిస్థాయిలో సబ్జెక్టు పై అవగాహన పెంచుకొని పన్ను రకాల గురించి క్షుణ్ణంగా అభ్యసనం చేయాలని సూచించారు. వివిధ రంగాలలో ఉద్యోగాలు ప్రభుత్వ ఉద్యోగాలు ప్రైవేట్ ఉద్యోగాలు నిర్వహించే ఉద్యోగులు పన్ను స్లాబుల గురించి పూర్తిస్థాయిలో అవగాహన అవసరమన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్లో రూపాయి మారకం విలువ వనరులు 36పైసలు ఇన్కమ్ టాక్స్ నుంచి 27పైసలు జీఎస్టి పన్ను వసూల్ నుంచి రాబడి వస్తుందని సూచించడం జరిగిందన్నారు. దీన్నిబట్టి ఒక రూపాయిలో అత్యధిక ఆదాయ వనరు పన్నులేనని అన్నారు. అడవిలో నివసించే ఏ వ్యక్తులు కూడా పనులు చెల్లించే అవసరం ఉండదు అన్నారు. సమాజంలో ఒక స్థిరమైన ప్రాంతంలో నివసించదలచిన మానవులు ఆ సమాజ అభివృద్ధి కొరకు పనులు చెల్లించిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఎస్వీయూ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు మాట్లాడుతూ పన్ను చెల్లింపులలో ఉద్యోగులకు ఎదురయ్యే పలు రకాల సమస్యలను రాష్ట్ర, కేంద్ర పన్ను చెల్లింపు అధికారులు పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా ఎస్వీయూ బోధన, బోధనేతర సిబ్బంది పన్ను స్లాబుల వివరాలు, చెల్లింపు పద్ధతులపై పూర్తిస్థాయిలో అవగాహన రాహిత్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఎస్వీయు ఉన్నతాధికారులకు తెలియకుండానే భారతీయ స్టేట్ బ్యాంకులో ఐదు కోట్ల రూపాయల పన్ను చెల్లింపు ఆదాయపు పన్ను విభాగానికి వెళ్లడం జరిగిందని, దాన్ని తిరిగి ఎస్వీయూకి వచ్చేందుకు సీఏ మోహన్ రెడ్డి ద్వారా ప్రయత్నిస్తున్నామన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు మాట్లాడుతూ సరైన అవగా హన లేకపోవడం ద్వారా ఒక ఆడిటర్‌కి చెల్లింపు చేయాలని సూచించినా, ఆరోగ్య బిల్లులు అప్లోడ్ చేయడంలో తప్పిదాల వలన నోటీసులు అందయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నోటీసుల్లో కూడా ఇన్కమ్ టాక్స్ అధికారులు చాలా కర్కశంగా నోటీసులు పంపించడం బాధాకర మన్నారు. ఆదాయపు పన్ను అధి కారులు ఈ అంశంపై పరిగణలోకి తీసుకొని ఎస్వీయూ అధికారులు ముఖ్యంగా ఆచార్య హొదాను గుర్తించి, వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా సమర్థవం తంగా పన్నులు చెల్లించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ టీవీ వంశీధర్, చార్టెడ్ అకౌంటెంట్లు ఫల్గుణ కుమార్, రవీంద్రారెడ్డి, ఆదాయ పన్ను అధి కారులు, సిబ్బంది, అధ్యా పకులు, చార్టెడ్ అకౌంటెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.




# మా గ్రామానికి దారి సమస్యను పరిష్కరించండి

**రెవెన్యూ అధికారులకు మారేడుపల్లె గ్రామస్తుల వినతి**

**గంగవరం, మేజర్‌న్యూస్‌:** గంగవరం పంచాయతీలోని మారేడుపల్లె గ్రామానికి చెందిన దారి సమస్యను పరిష్కరించాలని బుధవారం మారేడుపల్లెగ్రామస్తులు మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్‌కు వివరించి వినతిపత్రాన్ని అందించారు. గ్రామంలో నుండి గంగవరం మండలకేంద్రంతో పాటు పోలీసు స్టేషన్, కౌండిన్య నది, స్మశానవాటిక పశువైద్యశాల,తహసీల్దార్ కార్యాలయం, పాఠశాలలకు మరియు ఇతర ప్రదేశాలకు వెళ్లే ప్రధాన రహదారిని గ్రామానికి చెందిన ఓవ్యక్తి మూసివేసి ఇబ్బందులు కలిగిస్తున్నాడని, ఇదే సమస్యపై గత 2007వ సంవత్సరంలో కూడా తహసీల్దార్, పంచాయతీ సర్పంచ్ దృష్టికి తీసుకుని రాగా అప్పటి అధికారులు, పాలకులు చొరవతీసుకొని సమస్య పరిష్కారం చేసారు. కానీ ఈమధ్య అడ్డంగా మరల ఆ దారికి రాతి స్తంభాలు నాటి రాకపోకలకు అంతరాయం కలిగించాడు. దీనిపై గ్రామస్తులు ప్రశ్నించగా అతను దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేయబోయాడని గ్రామస్తులు ఆరోపించారు. కావున అధికారులు, పాలకులు చొరవతీసుకుని గ్రామానికి చెందిన దారిసమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.



## విద్యుత్‌దీపాలు, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి : కమిషనర్



**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్:** గూడూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, లైట్స్ వేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్ కలిసి వినతిపత్రం అందజేశారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ గెలిచినప్పటి నుండి గూడూరు పట్టణంపై ప్రత్యేక శ్రద్ధ వహించి లైటింగ్, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పూర్తిగా మెరుగుపరచాలని ప్రజలు ఇబ్బంది పడకుండా తగు చర్యలు తీసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అనేకసార్లు కమిషనర్ తో సమావేశమై ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారం స్థానిక నాయకులుగా మేము గత నాలుగు రోజులుగా పారిశుద్ధ్యం, లైటింగ్, మంచినీటి సరఫరా లోని సమస్యలను గుర్తించి నేడు కమిషనర్‌ని కలిసి పరిస్థితులను వివరించామని పట్టణంలో శివారు ప్రాంతాలలో లైటింగ్ సమస్య తీవ్రంగా ఉందని, వార్డులలో మధ్యాహ్న వేళ గ్యాంగ్ వర్క్ పెట్టించి కాలువలలోని సిల్టు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే లైటింగ్ డిపార్ట్మెంట్లో వర్కర్ల కొరత ఉందని, వర్కర్లు సంఖ్య పెంచాలని, లైట్లు అన్ని పూర్తిస్థాయిలో వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని శివారు ప్రాంతాల్లో లైటింగ్ సమస్య వలన పాములతో ప్రజలు తీవ్రంగా భయపడుతున్నారని, పై సమస్యలు పై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలని తెలియజేసి వినతిపత్రం అందజేశారు. త్వరలోనే అన్ని పనులను చేస్తామని మునిసిపల్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి, మాజీ కౌన్సిలర్ బిల్లు చెంచురామయ్య, తిరుపతి పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, గూడూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి అబ్దుల్ రహీం, గూడూరు పట్టణ తెలుగుదేశం పార్టీ ట్రెజరర్ తక్కెళ్ళపాటి చంద్రమౌళి, గూడూరు పట్టణ టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్ కుమార్, 33 వ వార్డు అధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధికి కృషి



**- నగరంలో నీటి సమస్యను పరిష్కరిస్తాను**
**- భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం**
**- మీడియాతో నూతన కమిషనర్ నారపురెడ్డి మౌర్య**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** నగర ప్రజలకు తాగునీటి సమస్యను మొదటి ప్రాధాన్యతగా పరిష్కరిస్తానని నగరపాలక సంస్థ నూతన కమిషనర్, స్మార్ట్ సిటీ ఎండి నారపురెడ్డి మౌర్య స్పష్టం చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ అదితిసింగ్ బదిలీపై కడప జాయింట్ కలెక్టర్ గా వెళ్లారు. కర్నూలు జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మీడియాతో మాట్లాడుతూ 2018 లో ఐఏఎస్ ఆఫీసర్‌గా ఎన్నికయ్యానన్నారు. కమిషనర్ గా పనిచేయడానికి అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతిలో తాగునీరు మొదటి ప్రాధాన్యత తీసుకుంటానన్నారు. తిరుమలకు వచ్చే యాత్రికులకు ఏటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కౌన్సిల్ సహకారంతో అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై వచ్చే పిర్యాధులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నిర్వహించిన కార్పొరేషన్ వివిధ విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించి అధికారులతో మాట్లాడారు. నగర అభివృద్ధికి కలిసికట్టుగా సమన్వయంతో పని చేద్దామని సూచించారు. నూతన కమిషనర్ మౌర్యకు అధికారులు, సిబ్బంది, పలువురు కార్పొరేటర్లు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు, అడిషనల్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్ నాగేంధ్ర రెడ్డి, హార్టి కల్చర్ ఆఫీసర్ హరికృష్ణా రెడ్డి, మెప్మా కృష్ణవేణి పాల్గొన్నారు.

# టిడిఆర్ బాండ్ల స్కాంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించండి

**- సిఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వంలో టిడిఆర్ బాండ్లు జరిగిన స్కాం పై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కలిసి నియోజవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. స్విమ్స్ ఆస్పత్రిలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించిన ప్రాణదాన పథకాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఎమ్మెల్యే సిఎంకు తెలిపారు. ప్రాణదాన పథకం నిలిచిపోవడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రాణదాన పథకం ప్రారంభించాలని కోరారు. అలాగే స్మార్ట్ సిటీ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు రాష్ట్ర వాటా కింద ఇవ్వాల్సిన 209.98 కోట్లను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. స్మార్ట్ సిటీ పనులు పూర్తవడానికి రాష్ట్ర వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాగా శ్రీవారి దర్శనాలను క్రమబద్ధీకరించి స్థానికులకు ఆఫ్ లైన్ టోకన్స్ ద్వారా స్పెషల్ ఎంట్రీ దర్శన సౌకర్యం కల్పించాలని కోరారు. కాగా గత ఐదేళ్ళుగా డిజైన్ లకే పరిమితమైన కొత్త సెంట్రల్ బస్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే కోరారు. సాధారణ ఎన్నికలకు ముందు వైసిపి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డిలు మాస్టర్ ప్లాన్ రోడ్లను నాణ్యత లేకుండా నిర్మించి టిడిఆర్ బాండ్ల జారీలో కోట్ల రూపాయల స్కాంకు పాల్పడ్డారని దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు. టిడిర్ బాండ్ల జారీలోనూ పక్షపాతంగా తండ్రీ, కొడుకులు వ్యవహరించి మెజార్టీ సభ్యులకు టిడిఆర్ బాండ్లు అందించలేదుని సిఎం దృష్టికి తీసుకెళ్ళారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల వల్ల భూమి కోల్పోయిన ప్రతి ఒక్కరికీ టిడిఆర్ బాండ్లు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు 2021 తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న దొంగ ఓట్ల కేసు విచారణను వేగవంతం చేసి దోషులకు శిక్ష పడేలా సంబంధిత అధికారలకు ఆదేశాలు ఇవ్వాలని సిఎంను ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే లేవనెత్తిన అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

**గూడూరు, మేజర్‌న్యూస్:** నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హెూంమంత్రి అనితను కలసిన ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాలలో భాగంగా హెూమ్ మంత్రిని కలసిన ఎంఎల్‌ఏ గూడూరు డివిజన్‌లో జోరుగా సాగుతున్న పారిశ్రామికీకరణ నేపథ్యంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు వస్తున్నట్లు తెలిపారు. ఆయా రాష్ట్రాలలో పరిస్థితుల ప్రభావం వారిపై ఉంటోందని అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నట్లు తెలిపారు. అక్కడ నుంచి వచ్చే కార్మికులపై పర్యవేక్షణ ఉండడం పరిశ్రమలు సైతం అక్కడ పని చేయించుకునేందుకు చూస్తున్నారు తప్ప వారి వ్యక్తిగత వివరాలు తీసుకోక పోవడంతో ఇబ్బందులు తలెత్తుతునటన్లు తెలిపారు, వారం రోజుల క్రితం బెంగాల్‌కు చెందిన ఒక కార్మికుడు గూడూరు పట్టణంలో పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటనను వివరించినట్లు తెల్సింది. ఇక్కడ పరిశ్రమల్లో పని చేసేందుకు వస్తున్న కార్మికుల వివరాలను ఆయా పరిశ్రమలు విధిగా పోలీసులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గం నందు రౌడీయిజం, గంజాయి, మత్తు పానియాల సరఫరాను అరికట్టేందుకు లా అండ్ ఆర్డర్ సరిగా పనిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని వారిని కలసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణపర్తి కిషోర్ నాయుడు, కేతంరెడ్డి మోహన్ రెడ్డి, వాటంబేటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మా జీతాలు పెంచి.. మా జీవితాల్లో వెలుగు నింపండి అమ్మ..!

**- అతిధి అధ్యాపకులుకు ఉద్యోగ భద్రత కల్పించాలి**
**- రెండు సంవత్సరాలుగా జీతాలు చెల్లించలేదని వెల్లడి**
**-ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేకూరుస్తానని భువనేశ్వమ్మ హామీ**



**కుప్పం, మేజర్‌న్యూస్:** మా జీతాలను పెంచి.. మా జీవితాల్లో వెలుగు నింపండి అమ్మ అంటూ నారా భువనేశ్వరమ్మకు అతిధి అధ్యాపకులు బుధవారం విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 472 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1072 మంది అతిధి అధ్యాపకులు పనిచేస్తున్నారని, గత 10 సంవత్సరాలుగా పనిచేస్తున్నా ఇంకనూ పది వేళ రూపాయలు మాత్రమే జీతం చెల్లించడం జరుగుతుందని, 2020-21,2021-22 రెండు సంవత్సరాలుగా జీతాలు చెల్లించలేదని వాటిని విడుదల చేయాలని వారు కోరారు.2018 సంవత్సరంలో ఇచ్చినటువంటి జి.ఓ ప్రకారం గంటకు 375 రూపాయలు చొప్పున పెంచాలని, మా యొక్క జీతాలను పెంచి నా జీవితాల్లో వెలుగు నింపండి అని భువనమ్మను కోరారు. అంతేకాకుండా అతిధి అధ్యాపకులుకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.ప్రతి సంవత్సరం 12 నెలలుకు ఒక్కసారి జీతాలు చెల్లించాలని కోరారు.దీనికి భువనేశ్వమ్మ స్పందించి వెంటనే మీ యొక్క విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేకూరుస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుమార్, ఉపాధ్యక్షులు రజనీకాంత్, బాలకృష్ణ, మురుగేష్, మోహనశివ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## 10వ తేదీ లోపు కంటి సమస్యలు ఉన్నవారి పూర్తి నివేదిక సమర్పించండి- జిల్లా కలెక్టర్

**కుప్పం, మేజర్‌న్యూస్:** ఆగస్టు 10వ తేదీ లోపు కుప్పం నియోజకవర్గంలో ఇంటింటి సర్వేలో భాగంగా కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించి పూర్తి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుప్పం నియోజకవర్గ పరిదిలోని మెడికల్ ఆఫీసర్లు, ఏ ఎన్ ఎం లతో కంటి వెలుగు. ఫీవర్ సర్వేల పురోగతి పై కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 19 నుండి ప్రారంభించిన ఇంటింటి సర్వేలో భాగంగా ఏ కారణంతో అయిన కంటిచూపు లేనివారి వివరాలను నమోదు చేయాలని ఈ సర్వే ప్రక్రియను రెండు వారాలలోపు పూర్తి చేయాలన్నారు. సర్వేలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా చేయాలని తెలిపారు. దీనితోపాటు ఫీవర్ సర్వేని కూడా చేయాలన్నారు. కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించిన సర్వే పూర్తి అయిన పిదప ప్రిలిమినరీ స్క్రీనింగ్ నిర్వహించి వారి ఆరోగ్య స్థితిగతులను బట్టి సర్జరీలను నిర్వహించే విషయంను నిర్ధారించడం జరుగుతుందని, కుప్పం, చిత్తూరు, తిరుపతిలలో సర్జరీ చేసే విషయంపై నిర్ణయించడం జరుగుతుందన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు డయాబెటిక్ పేషంట్ అయినట్లయితే వారు సకాలంలో మందులు వేసుకోవడం, వారి ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఏ ఎన్ ఎం లను ఆదేశించారు. ప్రతి ఏ ఎన్ ఎం వారి పరిదిలో గర్భవతులుగా వున్న వారి వివరాలను మూడు నెలల్లోపే నమోదు చేసుకొనేలా చూడాలన్నారు. డెలివరీ వరకు వారి ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ పెట్టి సుఖప్రసవం జరిగేలా మరియు డెలివేరీ అనంతరం తల్లి బిడ్డ సంరక్షణను 40 రోజుల పాటు మానిటరింగ్ చేయాలన్నారు. తల్లి ఆరోగ్యంతో పాటు బిడ్డ సంరక్షణ ప్రధానమన్నారు.ఈ సమావేశంలో కుప్పం ప్రాంతీయ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. విజయకుమారి, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ ఎం లు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న టీమ్ ఇండియా క్రికెటర్ ప్రసిద్ధ్ కృష్ణ

**తిరుమల, మేజర్ న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని టీమ్ ఇండియా క్రికెటర్ ప్రసిద్ధ్ కృష్ణ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం విఐపి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.



# కుప్పం ప్రజల రుణం ఎన్నటికీ తీర్చుకోలేం



- సీఎం బాబు సతీమణి భువనేశ్వరి
- భువనేశ్వరమ్మ రాకతో టీడీపీలో ఉత్సాహం
-- కార్యకర్తల్లో పెరిగిన మనోధైర్యం, ఎక్కడికక్కడ సమస్యల పరిష్కారం
- ఎన్.కొత్తపల్లి, నడుమూరు, పైపాళ్యం గ్రామస్థుల మహిళలతో భువనేశ్వరమ్మ ముఖాముఖి
- ఏనుగు దాడిలో గాయపడిన వ్యక్తికి భువనేశ్వరమ్మ చెక్కు అందజేత
- పైపాళ్యం గ్రామాన్ని దద్దత తీసుకొన్న భువనేశ్వరమ్మ
- రాజధానికి చెక్కు బహూకరణ చేసిన పైపాల్యం గ్రామస్తులు



**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం ప్రజల రుణం ఎన్నటికీ తీర్చుకోలేమని, 8సార్లు కుప్పం ప్రజలు చంద్రబాబును తమ గుండెల్లో పెట్టుకొని గెలిపించుకున్నారని, ఎనిమిదోవ సారి అఖండ మెజార్టీ తో గెలిపించిన కుప్పం ప్రజలకు ధన్యవాదాలు అంటూ నారా భువనేశ్వరి పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరమ్మ కుప్పం నియోజకవర్గం పర్యటనలో భాగంగా రెండో రోజు కుప్పం మండలం, ఎన్.కొత్తపల్లి గ్రామంలో భువనేశ్వరమ్మ మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గానికి భువనమ్మ రావడం మనకు పండుగ లాంటిది.చంద్రబాబు, లోకేష్, భువనమ్మ కుప్పం ప్రజలపై ప్రేమాభిమానాలు కురిపించడం మన అదృష్టం. మహిళలకు ఎలాంటి సమస్యలు ఉన్నా భువనమ్మకు వినతిపత్రంలో తెలియజేస్తే పరిష్కరిస్తారన్నారన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు, ముఖ్యంగా మహిళలకు నా ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు. వైసీపీ పాలనలో కుప్పం ప్రజలు, రాష్ట్ర ప్రజలు అనేక అరాచకాలు ఎదుర్కొన్నారు.ఈ అరాచకాలను అంతం చేసేందుకు కూటమి ప్రభుత్వాన్ని తెచ్చిన ప్రతి ఒక్కరికీ నా ధన్యవాదాలు. వైసీపీ పాలనలో స్వేచ్ఛగా మాట్లాడుకునే పరిస్థితి లేదు, స్వేచ్ఛగా ఓట్లు వేసే పరిస్థితులు కూడా లేవు. రాష్ట్ర ప్రజలు 2024 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని తీసుకొొచ్చి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను సాధించుకున్నారు. 2024 ఎన్నికల్లో మహిళలు తమ కుటుంబ సభ్యులను ప్రోత్సహించి ముందుకు నడిపించారు. అందుకే ఇంత పెద్ద ఫలితాలను మనం సాధించాం. చంద్రబాబును కుప్పం ప్రజలు 8సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు, 4సార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసుకున్నారు. కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు ప్రత్యేక మ్యానిఫెస్టోను ఎన్నికల సమయంలో ఇచ్చారు..దీన్ని అమలు చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారు.కుప్పం యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోయారు. ఈ పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో కుప్పంలో 3 పెద్ద పరిశ్రమలు తీసుకురావాలని చంద్రబాబు సంకల్పించారు. కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా అందిస్టామన్నారు. కుళాయిలు, రోడ్లు, అందుబాటులో పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాలను తీసుకురావడానికి చంద్రబాబు, లోకేష్ ప్రయత్నిస్తున్నారు.కుప్పం అభివృద్ధి కోసం ప్రత్యేక అధికారిని చంద్రబాబు నియమించారు.

**ఏనుగు దాడిలో గాయపడిన వ్యక్తికి భువనేశ్వరి చెక్కు అందజేత:** కొంతకాలం క్రితం నూలుకుంట గ్రామానికి చెందిన కరిసిద్దప్పపై ఏనుగు దాడి చేసింది. ఈ దాడిలో కరిసిద్దప్ప తీవ్రంగా గాయపడ్డారు. కరిసిద్దప్పకు అటవీశాఖ నుండి పరిహారంగా వచ్చిన రూ.88,745 చెక్కును నారా భువనేశ్వరి ఎన్.కొత్తపల్లి గ్రామంలో అందించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**పవిత్ర.. కొత్తపల్లి :** గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదు. 2014, 2018లో చంద్రబాబు డీఎస్సీ ఇచ్చారు. జగన్ డీఎస్సీ గురించి పట్టించుకోకపోవడం వల్ల నిరుద్యోగం పెరిగిపోయింది. చంద్రబాబు సీఎం అవగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం చాలా సంతోషం.

**భువనేశ్వరమ్మ :** డీఎస్సీపై చంద్రబాబు తొలిసంతకం చేసి మీకు మేలు చేయడం చాలా సంతోషం. కుప్పంలోని మిగిలిన నిరుద్యోగులకు ప్రత్యేక మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు.

**నడుమూరు గ్రామ మహిళలతో నారా భువనేశ్వరమ్మ ముఖాముఖి:** మీ ప్రేమ, అభిమానం, ఆదరణ, సంతోషం నన్ను ఇక్కడికి తీసుకొొచ్చిందని భువనమ్మ పేర్కొన్నారు.చంద్రబాబు గెలుపు కోసం మీరు నిద్రలేని రాత్రులు గడిపి ఎన్నికల్లో గొప్ప విజయాన్ని తీసుకొొచ్చారు. చంద్రబాబు నాయకత్వంపై మీకు నమ్మకం ఉందిగనుక 8సార్లు ఎమ్మెల్యేను చేశారు, 4సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ఘనత కుప్పం నియోజకవర్గం ప్రజలకే దక్కుతుంది. చంద్రబాబు కుప్పం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మ్యానిఫెస్టోను తీసుకొొచ్చారు...దాన్ని తప్పకుండా అమలు చేస్తారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పుడు కార్యకర్తలు ఏ విధంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చారో చంద్రబాబు టీడీపీని ముందుకు నడిపిస్తున్నప్పుడు నేడు అదే స్ఫూర్తిని చాటుకుంటున్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను భువనమ్మ తిలకించారు. కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు. పైపాళ్యం గ్రామ దత్తత, మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. వైసీపీ పాలనలో అనేక అరాచకాలతో విసిగిపోయిన మీరు 2024 ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేశారు.వైసీపీ పాలనలో ఒక్క గ్రామం కూడా అభివృద్ధి చెందలేదు..రాష్ట్రంలో నేడు కొలువుదీరిన కూటమి పాలనలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.. మీకు పూర్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉంది.రాష్ట్ర ప్రజలంతా ఒకే తాటిపైకి వచ్చి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి, ప్రజాప్రభుత్వాన్ని తీసుకొొచ్చారు. చంద్రబాబు నాయకత్వం గురించి మీరందరికీ తెలుసు...వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా పేదల పొట్ట కొట్టింది.చంద్రబాబు ప్రజలకు ముఖ్యమైనవన్నీ అందిస్తారు...ఆగష్టు 15న పేదవారికోసం అన్నాక్యాంటీన్లను తెస్తారు.2.70లక్షల మంది రోజుకు, సంవత్సర కాలంలో 7.5కోట్ల మంది అన్నా క్యాంటీన్లలో భోజనం చేశారు.చంద్రబాబు గత పాలనలో అమలు చేసిన పథకాలను మళ్లీ అమలు చేస్తారు.

**రాజధానికి విజయ్ కుమార్ చెక్కు బహుకరణ:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం కోసం పైపాళ్యం గ్రామస్తులు విజయ్ కుమార్ రూ.50వేల చెక్కును నారా భువనేశ్వరికి అందించారు. రాజధాని నిర్మాణంలో తాను కూడా భాగం కావాలనే ఉద్దేశంతో ఈ చెక్కును అందించినట్లు దాతలు ప్రకటించారు.



## శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

**తిరుమల, మేజర్ న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం స్వామి వారికి నిర్వహించే అర్చన సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల రాధాకృష్ణన్ మీడియాతో మాట్లాడుతూ లోక శాంతికి ఆధ్యాత్మిక భావమే సత్మార్గమని అన్నారు.

## బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ చంద్రముని

**వరదయ్యపాలెం, మేజర్‌న్యూస్:** వరదయ్యపాలెంలోని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని ఆకస్మికంగా తనిఖీ చేశారు.గదుల పరిశుభ్రత, విద్యరులకు మౌలిక సదుపాయాలు,భోజన సౌకర్యం తదితర విషయాల పట్ల,వార్డెన్ రాజారాంను విద్యార్థుల సమక్షంలో అడిగి తెలుసుకున్నారు.ఆర్డిఓ వెంట ఆర్ఐ వేణుగోపాల్,విఆర్ఓలు నాగేంద్ర,చలపతి తదితరులు పాల్గొన్నారు. కిటికీలు,తలుపులు గురించి విద్యార్థులు తెలుపగా, వసతి గృహానికి ప్రహరీ గోడ ఉంటే బాగుంటుందని వార్డెన్ రాజారాం,ఆర్డిఓ చంద్రమునిని కోరారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ, వసతి గృహము స్థలాన్ని సర్వే చేయించి, నివేదికను వీలైనంత త్వరగా అందజేయాలని విఆర్ఓ నాగేంద్రకు ఆదేశాలు జారీ చేశారు.



## ప్రతి ఫిర్యాదు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

**– కమిషనర్ డా. జె అరుణ**

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కలెక్టరేట్ ద్వారా అందే ఫిర్యాదులు, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో అందే ఫిర్యాదులు, ఇతర వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి.. పరిష్కరించాలని కమిషనర్ డా. జె అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్, డయల్ యువర్ ఎమ్మెల్యే, కలెక్టరేట్ ఫిర్యాదులు, ఇతరత్రా వినతులను పరిష్కరిస్తున్న తీరు, ఎండాస్మెంట్, రిపోర్టింగ్ విధానంపై సంబంధిత విభాగాల అధికారులు, వార్డు కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులను 24 గంటల్లో క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేయాలని, సంబంధిత వార్డు కార్యదర్శులతో పాటు సంబంధిత అధికారులు అర్జీదారులను కలిసి సమస్యపై చర్చించి పరిష్కరించాలన్నారు. ప్రతి సమస్యకు సంబంధించి క్షేత్ర విచారణ, పరిష్కరించిన తీరు, అర్జీదారుని ఫీడ్ బ్యాక్ తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, రెవిన్యూ, టౌన్ ప్లానింగ్, మెప్మా శాఖలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించిన తీరును, రిపోర్టులను పరిశీలించారు. ఎండార్స్మెంట్, రిపోర్టింగ్ విధానంపై పలు సూచనలు చేశారు. పరిష్కరించదగిన సమస్యలను కచ్చితంగా పరిష్కరించాలని, లేని వాటిని సరైన కారణాలతో అర్జీదారునికి తెలియపరచాలన్నారు. ప్రజా సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ విషయంలో ఎక్కడా జాప్యం జరగరాదన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్వో డా. అనిల్ కుమార్ నాయక్, ఎంఈ గోమతి, ఇతర అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ అరుణ

## రక్తి కట్టించిన దుర్యోధన వధ

**రామచంద్రాపురం, మేజర్‌న్యూస్:** మండలంలోని అనుప్పల్లి పంచాయితీ నూతుగుంటపల్లి, బీరమాకుల కండ్రిగ శ్రీ కృష్ణ ద్రౌపది సమేత ధర్మరాజుల మహాభారత మహోత్సవం సందర్భంగా బుధవారం మధ్యాహ్నం దుర్యోధుని వధ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో భారీ దుర్యోధనుడు విగ్రహం ఏర్పాటు చేశారు. శ్రీ వెంకటేశ్వర నాట్య కళామండలి కళాకారులు బొమ్మయ్యపల్లి కిరణ్ దుర్యోధునుడుగా, అశోక్ భీముడుగా వేషాలు వేసుకొని మొదటిగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దుర్యోధన విగ్రహం వద్ద భీముడు, దుర్యోధునుడు యుద్ధ సన్నివేశాలు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ ఘట్టాన్ని తిలకించడానికి చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

**భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం:** మహాభారతం మహోత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం ఆలయం ముందు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. భక్తులు స్నానాలు ఆచరించి ఉపవాసాలు ఉండి ఆలయంలో కంకణాలు ధరించి భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. మొదటిగా ద్రౌపతి దేవి అమ్మవారు విగ్రహంతో అగ్నిగుండ ప్రవేశం చేసిన వెంటనే భక్తులకు అన్నదానం చేశారు. ఈ మహాభారతం మహోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఆలయ కమిటీ ధర్మకర్త, సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.



# మంచి ఆహారంతోనే ఆరోగ్యం

శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్: శ్రీకాళహస్తి పట్టణం ది స్కూల్లో విద్యార్థులకు మంచి ఆహారపు అలవాట్లుపై అవగాహన పట్టణం ది స్కూల్ లో బుధవారం ఫుడ్ ఫెస్టివ్ కార్యక్రమం జరిగింది. కిండర్ గార్డెన్ విద్యార్థులచే ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు ప్రదర్శనను విద్యార్థులు అందరూ తిలకించారు. ఈ సందర్భంగా హెడ్ మిస్ట్రెస్ పి.విశాల మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో విద్యార్థి దశలోనే ఆహారపు అలవాట్లను గురించి తెలియజేయాల్సిన అవసరం వుందన్నారు. బయట తయారు చేసే ఆహార పదార్థాలకు జంక్ ఫుడ్స్ కు దూరంగా వుండాలని, ఇంట్లో తయారు చేసిన ఆహారం మాత్రమే తినాలని వివరించారు. విద్యార్థులకు ఆహార పదార్థాలపై అవగాహన కల్పించేందుకే ఈ ఫుడ్ ఫెస్టివ్' కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# హరికథ విరాళాధాతకు సన్మానం



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** మండలంలోని పచ్చికాపలం మహాభారతం ఉత్సవాల్లో జరుగు తున్న హరికథ కాలక్షేపానికి ఎర్రగుంటకు చెందిన పచ్చికా పలం టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కోనేరు చంగల్రాయ రెడ్డి7,500 రూపాయల విరాళాలని అందజే శారు. బుధవారం ఆలయ కార్యనిర్వహకులు విరాళాధాత చంగల్రాయిరెడ్డిని ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి ఎన్ ముని చంద్రారెడ్డి, బూత్ కన్వీనర్లు భాస్కర్ రెడ్డి, జయరాం రెడ్డి, బిజెపి నాయకులు గోవిందరెడ్డి, శేషాద్రి రెడ్డి, పురుషోత్తం రెడ్డిలు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలతో సభ్యత్వ నమోదు

**కార్వేటి నగరం, మేజర్ న్యూస్:** కార్వేటి నగర్ మేజర్ పంచాయతీ జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసిన కూలీలతో జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యులు యుగంధర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నగదు ఏవిధంగా పంపిణీ చేస్తున్నారు కూలీలు గిట్టుబాటు అవుతున్నారు. అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ఉపాధి కూలీలు జనసైనికులు పాల్గొన్నారు.





# టోల్ ప్లాజా వద్ద గంజాయి స్వాధీనం

**చిల్లకూరు, మేజర్న్యూస్:** మండలంలోని జాతీయ రహదారి పై బూదనం టోల్ ప్లాజా వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం టోల్ ప్లాజా సమీపం లో అక్రమంగా ఉన్న గంజాయితోపాటు రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న అధికారులు కేసు నమోదు చేసి కోర్టు లో హాజరు పరిచారు.

# ముమ్మరంగా జనసేన సభ్యత్వ నమోదు

**గూడూరురూరల్, మేజర్ న్యూస్ :** పట్టణంలో 4వ విడత జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం గూడూరు పట్టణంలోని హాస్పిటల్ రోడ్డు అల్ ఇస్లాం ఫవర్ టూల్స్ షాపులో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ నయీం మాట్లాడుతూ జనసేన పార్టీ వ్యవస్థాప అధ్యక్షులు, రాష్ట్ర మంత్రి పవన్ కల్యాణ్ పిలుపుమేరకు ఈ నెల 28వ తేదీ వరకూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్ప టికే నియోజకవర్గ పరిధిలోని చిల్లకూరు, కోట వాకాడు మండలాలలో జనసేన నాయకులకు సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించామన్నారు. పార్టీ ఇచ్చిన లక్ష్యాన్ని సమర్ధవంతంగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మణి, పవన్ పాల్గొన్నారు.



# నేడు మామిడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు

కార్వేటినగరం, మేజర్న్యూస్: స్థానిక శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయం లో గురువారం ఉదయం 10.00 గంటలకు ఉద్యాన శాఖ ఆధవర్యంలో మామిడి రైతులకు మండలం ఉన్న మామిడి రైతులు మామిడి కోత అనంతరం చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల" పై శాస్త్రవేత్తలచే అవగాహన కార్యక్రమం నిర్వహించబడును. రైతులు ఈ అవకాశాన్ని సద్వినయోగం చేసుకోగలరు. ఉద్యానవన శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయండి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** గత వైసిపి ప్రభుత్వంలో నియమించిన అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉద్యోగాలు మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిశీలించి వెంటనే భర్తీ చేయాలని బంజారా రాష్ట్ర అధ్యక్షులు మూడే హరి చౌహాన్ నాయక్ విజ్ఞప్తి చేశారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంచార్జి వీసీగా ఇటీవల బాధ్యతల స్వీకరించిన ఆచార్య ప్రొఫెసర్ సిహెచ్ అప్పారావు ను బుధవారం ఆయన చాంబర్ లో బంజారా రాష్ట్ర అధ్యక్షులు మూడే హరి చౌహాన్ నాయక్ ఆధ్వర్యంలో మర్యాద పరంగా కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో విశ్వవిద్యాలయాలను వైసిపి నాయకులు భ్రష్టు పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్ నిరుద్యోగులకు యువతకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు భద్రత కల్పిస్తూ వారికి భరోసాగా నిలుస్తున్నారని తెలియజేశారు. గత పాలకుల తప్పిదాలకు విద్యార్థులు యువత బలి అయ్యారని మండిపడ్డారు. వాటన్నింటినీ చక్కదిద్ది విద్యార్థులకు అండగా నిలవాలని కోరారు. అలాగే యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ ఉద్యోగాలను భక్తి చేయాలని కోరారు. కొన్ని డిపార్ట్మెంట్లో ఉద్యోగులు లేనందున పాలనపరంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, ఉద్యోగుల భర్తీతో విద్యార్థుల సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని తెలిపారు. వీటిపై సానుకూలంగా స్పందించిన విసి త్వరలోనే ప్రతి డిపార్ట్మెంట్ లో ఖాళీగా ఉన్న పోస్టులను పరిశీలించి భర్తీకి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఉపకులపతి ఆచార్య ప్రొఫెసర్ అప్పారావును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా, ఎన్డీఏ కూటమి నాయకులు రమేష్ బాబు, వెంకటేష్ నాయక్, అన్నయ్య రాజా నాయక్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.



# పూర్వీకుల సమాధులు కూల్చివేసారు : ముత్తాతల ఆస్తులను ఆక్రమించుకున్నారు

**రామచంద్రపురం, మేజర్న్యూస్:** తమ పూర్వీకుల సమాధులను కూల్చివేసి తాత ముత్తాతల కాలంనాటి ఆస్తులు ఆక్రమించుకున్నారని రామచంద్రాపురం మండలం, సొరకాయల పాలెం గ్రామానికి చెందిన నారాయణస్వామి కుమారుడు వెంకట ముని కృష్ణయ్య కుమారుడు మధు ఆవేదన వ్యక్తం చేశారు. రామచంద్రపురం మీడియా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన మునుస్వామి కుమారుడు గిరిబాబు, సుబ్రమణ్యం, కుమార్తె మునెమ్మ అనేవారు తమ పూర్వికులు కు చెందిన సొరకాయల పాలెం రెవెన్యూ గ్రామ లెక్క దాఖల సర్వేనెంబర్ 130/3లో వున్న 0.64 సెంట్ల భూమి తమకు పూర్వకుల నుంచి సంక్రమించిందన్నారు. తమ తాత వెంకట్రాయులకి వెంకట్రామయ్య నారాయణ స్వామి కృష్ణయ్య రామయ్య అనే ముగ్గురు కుమారులు ఉండేవారని చెప్పారు. 1958 వ సంవత్సరంలో నిర్వహించిన ఇండియన్ సర్వేలో పై వారికి నలుగురికి ఉమ్మడిగా పట్టా ఇచ్చారని తెలియజేశారు. అప్పటినుంచి వారు అనుభవిస్తూ వారి తనంతరం వారి కుమారులైన మాకు అప్పగించారని చెప్పారు. సదరు భూమిని మేము తమ కుటుంబానికి మాత్రమే స్మశానంగా ఉపయోగించుకుంటున్నామన్నారు. అందులో మా తండ్రి నారాయణస్వామి 1974లో, మా తల్లి వెంకటమ్మ 2004లో మృతి చెందారని వారిని ఆ భూమిలోనే ఖననం చేసి , అక్కడ సమాధులు కూడా నిర్మించామన్నారు. అయితే గ్రామానికి చెందిన మునుస్వామి కుటుంబ సభ్యులు తమకు ఆ భూమి పైన సర్వహక్కులు ఉన్నాయని అంటూ రాత్రికి రాత్రే సమాధులను పూర్తిగా కూల్చివేశారని ఆ స్థలాన్ని ఆక్రమించారని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆ స్థలంలో కొంత భాగానికి పట్టాదారు పాసుపుస్తకాలు కూడా పొందినట్లు ఆక్రమణదారులు చెబుతున్నారని తెలియజేశారు. ఈ విషయంపై చాలా సంవత్సరాలుగా అధికారులు చుట్టూ తిరుగుతున్నామని ఇప్పటివరకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమ బాధను ఆలకించి అన్ని విషయాలు పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.



# తాగునీటి పంపిణీ సమస్యపై ప్రజలు సహకరించాలి

**– మున్సిపల్ కమిషనర్ ఎం జనార్దన్ రెడ్డి.**

నాయుడుపేట మేజర్న్యూస్: పట్టణంలోని గాంధీ పార్క్ దగ్గర బుధవారం కరెంట్ పోల్ మార్చే ప్రక్రియ వల్ల పైప్ లైన్ లీక్ అయ్యింది. దీని వల్ల పట్టణంలోని అనేక ప్రాంతాలలో అనగా బాలాజీ గార్డెన్స్, పొగ గొట్టం కాలనీ, ఎస్వీటి వీధి, శంకరపురం, గరిడి వీధి, బ్రాహ్మణ వీధి, జై హింద్ కాలనీ మొదలగు ప్రాంతాలలో మంచినీటి సప్లైలో సమస్యలు ఏర్పడినందువల్ల ఈ ప్రాంత ప్రజలకు సరఫరా ఉండదని, సంబంధిత అధికారులు మంచినీటి సరఫరా పునరుద్ధరణ కు ప్రయత్నిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ ఎం జనార్దన్‌రెడ్డి తెలిపారు. సంబంధిత సిబ్బంది సహకారంతో రేపు సాయంత్రం లోపు మంచినీటి సరఫరాకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని, దీనికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



# చేనేత దినోత్సవం ఘనంగా జరుపుకుందాం

**- బండారు మోహన్ బాబు పిలుపు**

సత్యవేడు, మేజర్న్యూస్: ఆగస్టు7వ తేదీన చేనేత దినోత్సవంను ఘనంగా జరుపుకుందామని సత్యవేడు మాజీ ఎంపీటీసీ, బీజేపీ సీనియర్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం సత్యవేడు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీన చేనేత దినోత్సవంను ఘనంగా జరుపుకోవాలని,2015 లో నరేంద్ర మోదీ చేనేత దినోత్సవంను రూపొందించిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. భారత దేశంలో వ్యవసాయం తరువాత అతి పెద్ద కుటీర పరిశ్రమ చేనేత అని అన్నారు. జిల్లాలో ప్రతి మండలం లోను చేనేత దినోత్సవం జరుపుకోవాలని,చేనేత వస్త్రాల పట్ల వినియోగ దారులకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి సోమవారం తప్పనిసరిగా చేనేత వస్త్రాలు ధరించినయెడల, చేనేతలకు ఉపాధి చేకూర్చిన వారవుతారని అభిప్రాయపడ్డారు. జాతీయ చేనేత నాయకులు గుత్తి త్యాగరాజు మాట్లాడుతూ చేనేత దినోత్సవం కార్యక్రమంను, చేనేత కార్మిక సంఘాలు,చేనేత సహకార సంఘాలు,చేనేత వస్త్ర విక్రయ దుకాణాలలో ఘనంగా నిర్వహించాలని,తద్వారా ఆధునిక ప్రపంచంలో సంప్రదాయ చేనేత వస్త్రాలు కొనుగోలు పెరిగి,చేనేతలకు ఉపాధి దొరుకుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సామాజిక వర్గానికి చెందిన సి వెంకటేశులు పాల్గొన్నారు.



## 1న కెమెరాల ఈ-వేలం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన కెమెరాలను ఆగస్టు 1న రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నారు. ఇందులో నైకాన్, కెనాన్, కొడాక్ తదితర కెమెరాలు ఉన్నాయి. ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న కెమెరాలు మొత్తం 10 లాట్లు ఈ-వేలంలో ఉంచారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో కార్యాలయం వేళల్లో, టిటిడి వెబ్‌సైట్ లేదా రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్‌ను సంప్రదించగలరు.

## 30న కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తిక

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 30వ తేదీన ఆడికృత్తిక పర్వదినం జరగనుంది. ఈ సందర్భంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఉత్సవర్లకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

## టీటీడీకి రెండు ఎలక్ట్రిక్ స్కూటర్లు విరాళం



**తిరుమల, మేజర్ న్యూస్:** కలకత్తాకు చెందిన మోటోవోల్ట్ సీఈవో తుషార్ చౌదరి బుధవారం రూ.2.45 లక్షలు విలువైన రెండు ఎలక్ట్రిక్ స్కూటర్లను టీటీడీకి విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయం ఎదుట జెఈవో వీరబ్రహ్మంకు మోటోవోల్ట్ సంస్థ ప్రతినిధులు స్కూటర్ తాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల డిఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## శ్రీవారి సన్నిధిలో పాలిమరు మఠాధిపతి



**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీవారిని కర్ణాటకలోని ఉడిపి చెందిన పాలిమరు మఠాధిపతి శ్రీ శ్రీ విద్యాధీశ తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనార్థం ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్న స్వామీజీకి టిటిడి అర్చకస్వాములు, టీటీడీ జె ఈ ఓ వీరబ్రహ్మం చిన్న మర్యాద స్వాగతం పలికి దర్శనం చేయించారు. దర్శనం అనంతరం శ్రీ రంగనాయక మండపంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

## స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయండి



**కుప్పం, మేజర్ న్యూస్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు వినతి పత్రాన్ని అందజేశారు. గడిచిన 12 ఏళ్ళుగా నామమాత్రపు వేతనాలకు కాంట్రాక్ట్ పద్ధతిలో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరగా నారా భువనేశ్వరి సైతం సానుకూలంగా స్పందించడం పట్ల స్టాఫ్ నర్సులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ఎన్ఈపి ఆకారంలో విద్యార్థులు



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ లోగోతో వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించారు. శిక్ష సప్త హే విద్యా వారోత్సవాల్లో భాగంగా బుధవారం వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రదర్శించడం సంతోషదాయకమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అన్నారు. వారోత్సవాల్లో ప్రతిరోజు ఒక్కో కార్యక్రమంలో అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపినట్లు అవుతుందన్నారు. తద్వారా విద్యా వికాసానికి తోడ్పాటును అందిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మండలంలోని బనకందొడ్డి గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక శివాలయం నందు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బట్టందొడ్డి దాసార్లపల్లి,రామాపురం, ముత్తుకూరు కరసనపల్లి, కమ్మినాయనపల్లి ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో చేరిన 100 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా ఒక జత యూనిఫామ్, విద్యా సామాగ్రి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే ఢిల్లీలో ధర్నా చేయడం ఎంతవరకు సమంజసం

### – తెలుగుదేశం నేత రెడ్డి వారి గురవారెడ్డి



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** ఢిల్లీలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న దీక్షను ఖండిస్తూ శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా రెడ్డి వారి గురవారెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు మాజీ ముఖ్యమంత్రి గత ప్రభుత్వం చేసిన అవినీతి అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పే విధంగా 11 సీట్లు ఇచ్చి వ్యతిరేకతను చూపించిన అదేమీ లెక్కచేయకుండా నేడు సుపరిపాలన అందజేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరసన చేపట్టడం సమంజసం కాదని ఆయన హితువు పలికారు, ఆంధ్రప్రదేశ్లో ఇప్పటికే 36 మంది మృతి చెందారని ఆరోపణలు చేస్తూ ఆంధ్రప్రదేశ్లో శాంతిభద్రతలు లేవంటూ ఆయన ఢిల్లీలో నిరసన చేపట్టడం హాస్యస్పదంగా ఉందన్నారు ,ఢిల్లీలో నేషనల్ మీడియా చనిపోయిన 36 మంది పేర్లు చెప్పమని వైయస్ జగన్మోహన్ రెడ్డిని అడిగితే మృతి చెందిన వారి పేర్లు చెప్పమని అడిగితే పేర్లు చెప్పకుండా తప్పించుకున్న వ్యక్తి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎదవ చేశారు నేడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే సమావేశాలను ఎగ్గొట్టి, కోర్టు కేసులను తప్పించుకోడానికి మాత్రమే ఢిల్లీలో నిరసన చేపడుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు, ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిగా ఆంధ్రప్రదేశ్ రాజధానికి పునర్నిర్మాణం అభివృద్ధికై 150 కోట్లు కేంద్ర బడ్జెట్లో కేటాయించుకొని రాష్ట్రానికి తీసుకొని రావడం చంద్రబాబు నాయుడు యొక్క సుపరిపరిపాలనకు నిదర్శనమని నేడు ప్రజల సంక్షేమర్థ్యం ప్రజా పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వం బురద చల్లడానికె నేడు ఢిల్లీలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరసన దీక్ష చేపడుతున్నారని, గత ప్రభుత్వంలో ప్రజా కట్టకంగా పరిపాలన చేసిన జగన్మోహన్ రెడ్డికి, ఢిల్లీలో నిరసన దీక్ష చేపట్టే అర్హత లేదని వెంటనే నిరసన విరమించాలని ఈ సందర్భంగా ఆయన తెలుగుదేశం పార్టీ నాయకులు తరపున ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయం కొత్త వెబ్‌సైట్ ప్రారంభం



**గుడుపల్లి, మేజర్ న్యూస్:** ద్రావిడ విశ్వవిద్యాలయం యొక్క కొత్త వెబ్‌సైట్‌ను గౌరవనీయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్. దొరస్వామి నాయుడు ప్రారంభించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఇది గొప్ప ముందడుగు, ఈ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో కొత్త శకంలోకి అడుగుపెడుతోందని, ఇప్పుడు విశ్వవిద్యాలయం ప్రపంచవ్యాప్త దృష్టిని సాధిస్తుందని ఆయన తెలియజేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కిరణ్ కుమార్ గారు మాట్లాడుతూ ఈ డైనమిక్ వెబ్‌సైట్ విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయోగపడుతుందని, ఎన్ఎఎఎస్ కోసం ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుతుందని తెలిపారు. ఈ ఘనత సాధించిన వెబ్ సైట్ అధికారి డాక్టర్ ఎస్.రాజేశ్వర్ రెడ్డిని అధికారులు అభినందించారు. వెబ్‌సైట్ అధికారి డా.రాజేశ్వర్ రెడ్డి కొత్త వెబ్‌సైట్ యొక్క ముఖ్య లక్షణాల గురించి వివరించారు, ఈ విద్యార్థి స్నేహపూర్వక వెబ్‌సైట్ విశ్వవిద్యాలయం గురించి మొత్తం డేటాను అందిస్తుందని చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ డిపార్ట్‌మెంట్ల డీన్‌లు, హెడ్‌లు పాల్గొన్నారు. ఈ కొత్త వెబ్ సైట్ పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

## ఈచ్చర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**బంగారుపాళ్యం, మేజర్ న్యూస్:** బంగారుపాల్యం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ సమీపమున మద్యం దుకాణం ఎదురుగా ఈచర్ వాహనము డీ కొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం 11: 15గం"లకు చోటుచేసుకుంది. బంగారుపాళ్యం పోలీసుల వివరాల ప్రకారం కేఎల్ 59, 5588 నెంబర్ గల ఈచర్ వాహనం పలమనేరు మండలం బొమ్మిదొడ్డి గ్రామానికి చెందిన ఎన్.గోవింద రెడ్డి వయస్సు 69 సం"లు తండ్రి లేట్ చెంగారెడ్డి, అతని కుమార్తె రేణుక తమ టీవీఎస్ వాహనం నందు కల్లూరుపల్లి గ్రామమునకు వెలుచుండగా ప్రమాదం జరిగినది.ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన గోవిందరెడ్డిని బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే గోవిందరెడ్డి మరణించినట్లు తెలిపారు. ఈ ప్రమాదమునకు సంబంధించి ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

## మా ఇంటి స్థలాలు మాకు ఇప్పించండి



**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** మండలంలోని ఆమినిగుంట గ్రామానికి చెందిన దళితులు నిరసన చేపట్టారు. తమకు 1995 వ సంవత్సరం ఎస్సీ కాలనీకి చెందిన 18 మంది దళితులకు ఇందిరమ్మ గృహాలను కేటాయించి నిర్మించడం జరిగిందని, శిథిలావస్థలో ఉన్న ఇళ్ళను కొందరు కబ్జాదారులు రాజకీయ అండతో వాటిని నేలమట్టం చేసి దురాక్రమనకు పాల్పడ్డారని వారు తెలిపారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపరదారులు వాటిని అక్రమంగా విక్రయాలకు పాల్పడుతున్నారని వారు వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై గ్రామరెవిన్యూ అధికారిని వివరణ అడుగగా గ్రామస్తులకు పట్టాలిచ్చిన భూమి పెద్దకొండామర్రి పైకి సర్వేనెంబర్ 744/2 అని,ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేస్తున్న సర్వే నెంబర్ 770/1 అని అది పూర్తివిస్తీర్ణం 7 ఎకరాలని,ఐతే సర్వే నెంబర్ 770/2 లో 0.51 సెంట్ల భూమిని అక్విజేషన్ చేసుకున్నారని వి.ఆర్.ఓ తెలియజేశారు.

## వాటర్ ప్లాంట్లకు నోటీసులు

**నాయుడుపేట మేజర్‌న్యూస్:** పట్టణం పరిధిలోని ఐదు వాటర్ ప్లాంట్లకు నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎం జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలోని అధికారుల బృందం ప్లాస్టిక్ నీటి ప్యాకెట్లను తయారు చేయకుండా నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎం జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి తీవ్ర విఘాతాన్ని కలిగించే ప్లాస్టిక్‌ని ఉపయోగించడం చట్టరీత్యా నేరమని కనుక ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లను పూర్తిగా నిషేధించి వ్యాపారాలు నడుపుకోవాలని ఆయన కోరారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయుడుపేట పట్టణంలో నిర్వహిస్తున్న 5 వాటర్ ప్లాంట్లను పూర్తిగా పరిశీలించిన తర్వాత వారికి నోటీసులు ఇవ్వడం జరిగిందని ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ అధికారుల సూచనలను ఎవరైనా పెడచెవిన పెట్టి ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లను తయారు చేసిన ఎడల అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం జనార్దన్ రెడ్డి హెచ్చరించారు.



# ఆంధ్రప్రదేశ్ ప్రజలను పక్కదోవ పట్టించేందుకే జగన్ నాటకాలు

**జగన్ డ్రామాలు ప్రజల నమ్మరు**

**సీఎం హెూదాలో అప్పట్లో ఏపీ అభివృద్ధి కోసం ఢిల్లీలో ధర్నా చేసుంటే బాగుండేదేమో**

**చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రజలను పక్కదోవ పట్టించేందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో ధర్నాలు చేస్తూ నాటకాలకు తెరతీసారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు విమర్శించారు. ఆయన డ్రామాలను ప్రజలు నమ్మరని చెప్పారు.ఏపీలో శాంతి భద్రతలు నశించాయంటూ దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ధర్నాను బుధవారం ఢిల్లీలో తప్పుపట్టారు ప్రసాద్ రావు.ఢిల్లీ, అశోక రోడ్లోని క్వార్టర్ నెంబర్ 50లో జరిగిన విలేకరుల సమావేశంలో చిత్తూరు ఎంపీ, సహచర పార్లమెంటు సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి రాజ్యాంగంతో పాటు, ప్రజాస్వామ్య విలువలపై గౌరవం లేదన్నారు. అందువల్లే ఆయన ముఖ్యమంత్రిగా పని చేసిన ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో లేవన్న విషయాన్ని జగన్ గుర్తించాలన్నారు. ఆయన నియంత్రత్వ పోకడలవల్లే పేద ప్రజలు ఎన్నో కష్టాలు చెవి చూశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఢిల్లీలో నిరసనకుదిగి, ఆంధ్రప్రదేశ్లో ప్రజలకు భద్రత లేదంటూ ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ముఖ్యమంత్రి హెూదాలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం అప్పట్లో ఢిల్లీ కేంద్రంగా ధర్నాలు చేసి ఉంటే బాగుండుందేమోనన్నారు. డాక్టర్ సుధాకర్ విషాదకర రీతిలో మృతి చెందినప్పుడు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం డోర్ డెలివరీ చేసినప్పుడు.. జగన్మోహన్ రెడ్డి ఎక్కడున్నారని ప్రశ్నించారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఊచకోతకు గురైనప్పుడు ముఖ్యమంత్రి హెూదాలో జగన్మోహన్ రెడ్డి ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఇప్పుడేదో ఏపీలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ జగన్ రెడ్డి, ఎన్‌డిఏ సర్కారుపై విమర్శలు చేయడం చూస్తుంటే,జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని, ఆయన మాజీ ముఖ్యమంత్రి తీరును తప్పు పట్టారు.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఢిల్లీ పర్యటనలన్నీ కేవలం న్యాయపరమైన కేసుల కోసమే దేశ రాజధాని చుట్టూ చక్కర్లు కొట్టేవారని తెలియజేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాల కోసం ఏనాడు కేంద్ర పెద్దలతో చర్చించే వారు కాదని తెలిపారు. కనీసం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం తాను దేశ ప్రధానితోనూ లేదా కేంద్ర మంత్రులతో చర్చించినట్లు ఒక్కసారైనా ఢిల్లీలో మీడియాతో మాట్లాడారా ఆ దిశగా జగన్మోహన్ రెడ్డి అడుగులేసారా అన్న విషయాలను ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి కొణెదల పవన్ కళ్యాణ్ ఏపీ అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగుతుంటే, ఓర్వలేని వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్ష హెూదా కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ, ఢిల్లీలో ధర్నాలు చేయడం తప్ప, జగన్ రెడ్డి వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఒరిగేదేమీ లేదన్నారు. ఇకనైనా మాజీ ముఖ్యమంత్రిగా, పులివెందుల శాసనసభ్యులుగా అసెంబ్లీ సమావేశాలకు హాజరై, పనిచేసే ప్రభుత్వానికి సహకరిస్తే ప్రజలు హర్షిస్తారని దగ్గుమళ్ళ ప్రసాద రావు సూచించారు.

# తిరుమలలో ఘనంగా పల్లవోత్సవం



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమలలో బుధవారం పల్లవోత్సవం ఘనంగా జరిగింది. మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని టీటీడీ పల్లవోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సహస్రదీపాలంకారసేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేశారు. మైసూర్ సంస్థానం వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు.

అనంతరం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పేష్కర్ శ్రీహరి, ఇతర అధికారులు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శుభం భన్సల్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** జిల్లాలో ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు.



2020 బ్యాచ్‌కి చెందిన శుభం బన్సల్ బుధవారం జిల్లాజాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ శ్రీవారి పాదాలచెంత జేసీగా పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. జేసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ జయరాములు, కలెక్టరేట్ సిబ్బంది జేసీకి శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రాథమిక రంగాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

**జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** బ్యాంకర్లు వ్యవసాయం, విద్య, ఎంఎస్ఎంఈ వంటి ప్రాధాన్యత రంగాలకు లక్ష్యం మేరకు రుణాలు విరివిగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం చైర్మన్ హెూదాలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎల్డీఎం విశ్వనాథ రెడ్డి, ఆర్బిఐ ఎల్‌డిఓ పూర్ణిమ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ జి.రాంప్రసాద్, వివిధ బ్యాంకు అధికారులుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయం, విద్య, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ బ్యాంకర్లందరూ రుణాలను మంజూరు చేయడంతో పాటు నిర్దేశించబడిన లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కౌలు రైతు కార్డుదారులకు క్రాప్ లోన్‌కి సంబంధించిన రుణాలను బ్యాంకర్లు సకాలంలో మంజూరు చేయాలని తెలిపారు. కౌలు రైతు కార్డులను రెన్యువల్ చేసుకోవాల్సిన కౌలు రైతులను గుర్తించి రెన్యువల్ చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్‌కు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు రుణాల మంజూరు చేయడంలో ఎలాంటి జాప్యం చేయరాదని తెలిపారు. బ్యాంకర్లు ప్రభుత్వ ప్రాధాన్యత గల పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టి లక్ష్యం మేరకు రుణాలను మంజూరు చేయాలని తెలిపారు. జిల్లాలో ఫైనాన్స్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలన్నారు. అనంతరం అన్యువల్ క్రెడిట్ ప్లాన్ 2024-25 బుక్‌లెట్‌ను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పెంచల్ కిషోర్, నాబార్డ్ డీడీఎం సునీల్, డిఆర్డిఏ పీడీ ప్రభావతి, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి సతీష్ పాల్గొన్నారు.





**జనం కోసమే సూర్య**

మీ అభిప్రాయాలే మా కథనాలు

నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

**కె.సురేష్‌బాబు** (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

**ఎన్.లక్ష్మినారాయణ** (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116